గురకను నిరోధించే తలగడ

వాషింగ్టన్, ఆగస్టు 3: నిద్రలో మీరు గురక పెడుతున్నారా? అయితే మీ సమస్యకు చెక్‌పెట్టే సరికొత్త తలగడ (దిండు) అందుబాటులోకి వచ్చింది. దాని పేరే 'హూటీ'. బోన్ కండక్షన్ టెక్నాలజీ సాయంతో మీ నిద్ర నాణ్యతను, గురకను గుర్తించడం, అందుకు సంబంధించిన సమాచారాన్ని కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో విశ్లేషించడం ద్వారా సరిగ్గా శ్వాస తీసుకోగలిగే వరకు మీ తల భంగిమను నిశ్శబ్దంగా మార్చడం, ఈ ప్రక్రియలో మీకు ఎలాంటి నిద్రాభంగం కలిగించకపోవడం ఈ తలగడ ప్రత్యేకత. గురకను నిరోధించే తర్వాతి తరం తలగడగా చెప్పున్న 'హూటీ' ఎలాంటి ఇతర పరికరాల అవసరం లేకుండానే మీతోపాటు మీ పక్కన ఉన్నవారు హాయిగా నిద్ర పోయేందుకు వీలు కల్పిస్తుంది. నిద్రించేటప్పుడు వయోజనుల్లో దాదాపు సగం మంది అడపా దడపాగా, 25% మంది తరచుగా గురక పెడుతున్నట్టు అంచనా. దీని వల్ల అలాంటివారితో పడకను పంచుకున్నవారితోపాటు అదే గదిలో నిద్రించే ఇతరులకు సరిగా నిద్రపట్టక ఆరోగ్యం దెబ్బతింటున్నది. పవర్ కేబుల్, ట్రావెల్ బ్యాగ్‌తో కలిపి లభ్యమయ్యే ఈ తలగడను ప్రస్తుతం అమెరికా మార్కెట్‌లో 199 డాలర్ల (దాదాపు రూ.16,675) ప్రత్యేక ప్రారంభ ధరతో ప్రవేశపెట్టారు. 'హూటీ' షిప్పింగ్స్ అక్టోబర్ నుంచి మొదలు కానున్నట్టు తెలుస్తున్నది.

ఆత్మీయులను కోల్పోతే వేగంగా వృద్ధాప్యం!

న్యూఢిల్లీ: ఆత్మీయులను కోల్పోవడం అత్యంత బాధాకరం. ఆ ఆవేదన నుంచి కోలుకోవడం చాలా కాలం వరకు సాధ్యం కాదు. దీని ప్రభావం జీవించి ఉన్నవారి వృద్ధాప్యంపై కూడా పడుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన మెయిల్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, బట్లర్ కొలంబియా ఏజింగ్ సెంటర్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు, భార్య/భర్త, తోబుట్టువులు లేదా పిల్లలను కోల్పోయినవారికి, ఇలాంటి సంఘటనలు జరగనివారికి వృద్ధాప్యం ఏ విధంగా వస్తున్నదో వీరు పరిశీలించారు. ఆత్మీయులను కోల్పోయినవారికి వేగంగా వృద్ధాప్యం వస్తున్నట్లు వీరు గుర్తించారు. పరిశోధకుడు అలిసన్ అయిల్లో మాట్లాడుతూ, బాల్యం నుంచి వయోజనులయ్యే వరకు జీవితంలో ఆత్మీయులను కోల్పోవడానికి, జీవ సంబంధిత వృద్ధాప్యం వేగవంతమవడానికి మధ్య బలమైన సంబంధం ఉన్నట్లు గుర్తించామన్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ, కణజాలం, అవయవాలు పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని, తీవ్ర స్థాయి వ్యాధులు వృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జీవ సంబంధిత వృద్ధాప్యాన్ని ఎపిజెనెటిక్ క్లాక్స్ (డీఎన్ఏ మార్కర్లు) ఆధారంగా నిర్ణయించవచ్చునని తెలిపారు. కణజాల స్థాయిలో శరీరం ఎంత వేగంగా వృద్ధాప్యం దిశగా అడుగులు వేస్తున్నదో ఈ క్లాక్స్ చెబుతాయని వివరించారు. ఆత్మీయులను కోల్పోవడానికి, జీవితాంతం ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి మధ్య సంబంధం ఉందన్నారు. నడి వయసుకు ముందే వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తాయని ఈ అధ్యయనం తెలిపింది. ఎక్కువ మంది ఆత్మీయులను కోల్పోయినవారికి వృద్ధాప్యం వేగంగా వచ్చినట్లు తెలిపింది. చిన్న వయసులోనే తల్లిదండ్రులను లేదా తోబుట్టువులను కోల్పోయినవారిపై ఆ బాధ జీవితాంతం తీవ్రంగా ఉంటుందని తెలిపింది. ఈ పరిస్థితులు మానసిక ఆరోగ్య సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, అకాల మరణాలకు దారి తీసే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఆత్మీయులు మరణించిన తర్వాత చాలా కాలం వరకు ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని పేర్కొంది. బాల్యం, కౌమార దశల్లో ఇటువంటి సంఘటనలు జరిగితే, ఆ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని తెలిపింది.

నాట్య శిఖరం యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

శాస్త్రీయ నృత్యంలో చెరగని ముద్ర

న్యూఢిల్లీ/ హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): శాస్త్రీయ నృత్యంలో తనదైన ముద్రవేసి అభిమానుల్లో చెరగని స్థానం సంపాదించుకున్న ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి (84) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధ పడుతున్న ఆమె ఢిల్లీలోని అపోలో దవాఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. 1940 డిసెంబర్ 20న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆమె జన్మించారు. బాల్యమంతా తమిళనాడులో సాగింది. 1956లో నృత్య ఆరంగేట్రం చేశారు. భరతనాట్యం, కూచిపూడితో పాటు ఒడిస్సీ సైతం నేర్చుకున్నారు. కర్ణాటక గాత్ర సంగీతం, వీణ వాయించడంలోనూ ఆమె దిట్ట. ఆమె ప్రధానంగా భరతనాట్యం, కూచిపూడిపై దృష్టి సారించి అనేక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యంలో ప్రపంచవ్యాప్తంగా భారత దేశ కీర్తిని వ్యాపింపచేశారు. మోహినీగా, సత్యభామగా, ఉషగా, శశిరేఖగా ఆమె అనేక నృత్య రూపకాల్లో పలు పాత్రలతో ఆకట్టుకున్నారు. యామిని కృష్ణమూర్తిని 1968లో పద్మశ్రీ, 2001లో పద్మ భూషణ్, 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం గౌరవించింది. ఆమె టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలందించారు. ' ఏ ప్యాషన్ ఫర్ డ్యాన్స్' పుస్తకం రచించారు. 1990లో ఢిల్లీలో యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ సంస్థను స్థాపించారు. యామినీ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

అవయవాల రవాణాకు కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : అవయవాలను అత్యంత వేగంగా రవాణా చేసి అవసరమైన వారికి అమర్చి(ట్రాన్స్‌ప్లాంటేషన్) వారి ప్రాణాలను కాపాడేందుకు అవలంబించాల్సిన ప్రామాణిక పద్ధతి(ఎస్‌ఓపీ)ని కేంద్రం శనివారం విడుదల చేసింది. నీతి ఆయోగ్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో వైద్య శాఖ దీనిని రూపొందించింది. వాయు మార్గం, అంబులెన్స్, మెట్రో, డిఫెన్స్, రోడ్డు మార్గం, రైలు, జల మార్గాల్లో అవయవాలను రవాణా చేసేటప్పుడు కచ్చితంగా పాటించాల్సిన పద్ధతిని నిర్దేశించింది. మానవ అవయవాలను దేశ భూభాగంలో మాత్రమే రవాణా చేయాలని స్పష్టం చేసింది.

మాన్ పారిస్ పర్యటనకు అనుమతి నిరాకరణ

చండీగఢ్: ఒలింపిక్ క్రీడల్లో భారత హాకీ టీమ్‌కు మద్దతు పలకడం కోసం పారిస్ వెళ్లేందుకు సిద్ధమైన పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు కేంద్ర ప్రభుత్వం 'పొలిటికల్ క్లియరెన్స్' నిరాకరించిందని అధికారిక వర్గాలు శనివారం వెల్లడించాయి. భగవంత్ మాన్.. ఆదివారం పారిస్‌లో జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు వెళ్లాలనుకున్నారు. అయితే జడ్ ప్లస్ క్యాటగిరీ భద్రత ఉండే సీఎం మాన్‌కు.. ఇంత తక్కువ సమయంలో ఆ స్థాయి భద్రత అమర్చడం సాధ్యం కాదని పేర్కొంటూ కేంద్రం ఆయనకు అనుమతి నిరాకరించిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

కశ్మీర్ ఐఏఎస్‌పై క్రిమినల్ ధిక్కార కేసు

శ్రీనగర్: జడ్జిని బెదిరించారన్న ఆరోపణలపై జమ్ముకశ్మీర్ హైకోర్టు గందేర్‌బల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్యామ్‌బిర్ సింగ్‌కు సమన్లు జారీ చేసింది. సోమవారం 11 గంటలకు కోర్టు ముందు హాజరు కావాలని జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ సంజీవ్ కుమార్ ధర్మాసనం ఆదేశించింది. గతంలో ఓ తీర్పును పాటించనందుకు ఆయన వేతనాన్ని అటాచ్ చేయాలని గందేర్‌బల్ సబ్ జడ్జి ఫయాజ్ అహ్మద్ ఖురేషీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్యామ్‌బిర్ తన అధికార దుర్వినియోగంతో ప్రతీకారానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి.

రక్త పరీక్షతో పురుషుల వంధ్యత్వ నిర్ధారణ

ఏఐ వ్యవస్థను అభివృద్ధి చేసిన జపాన్ పరిశోధకులు



టోక్యో, ఆగస్టు 3: పురుషుల్లో సంతాన లేమిని గుర్తించేందుకు ఇప్పటివరకు వీర్య పరీక్ష చేయాల్సి వచ్చేది. ఇక నుంచి ఈ అవసరం లేదంటున్నారు జపాన్‌లోని టోహో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు. ఒక చిన్న రక్త పరీక్షతో పురుషుల్లో సంతాన లేమి(వంధ్యత్వం) సమస్యను గుర్తించవచ్చని చెప్పన్నారు. ఇందుకు గానూ వీరు ఒక కృత్రిమ మేధ(ఏఐ) మాడల్‌ను అభివృద్ధి చేశారు. ఇది రక్తంలో ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, పీఆర్ఎల్, టోటల్ టెస్టోస్టిరోన్, ఈ2 వంటి వివిధ హార్మోన్ల స్థాయిలను విశ్లేషించి 74 శాతం కచ్చితత్వంతో పురుషుల వంధ్యత్వాన్ని గుర్తిస్తుందని, కొందరు పురుషుల్లో ఉండే అజూస్పెర్మియా సమస్యను 100 శాతం ఖచ్చితత్వంతో గుర్తించవచ్చని చెప్పారు. 3,662 మంది రోగుల వైద్య నివేదికల సమాచారం ఆధారంగా ఈ ఏఐ మాడల్‌ను అభివృద్ధి చేసినట్టు అసోసియేట్ ప్రొఫెసర్ హిడెయుకి కొబయషి తెలిపారు. ఈ ఏఐ మాడల్‌ను 2021, 2022లో పలువురిపై పరీక్షించగా వంధ్యత్వానికి సంబంధించి 68 శాతం, అజూస్పెర్మియాకు సంబంధించి 100 శాతం ఖచ్చితత్వంతో ఫలితాలు వచ్చినట్టు తెలిపారు.

గుండె మరమ్మతుకు బ్యాండేజీలు!

కొత్త 3డీ ప్రింటింగ్ పద్ధతి అభివృద్ధి

న్యూఢిల్లీ: గుండె, ఇతర శరీర భాగాలకు చికిత్స చేయడానికి బ్యాండేజీలు రాబోతున్నాయి. ఆయా భాగాల కణజాలాలతో కలిసిపోయి పనిచేసే ఓ కొత్త రకం పదార్థం అందుబాటులోకి రాబోతున్నది. త్రీడీ ప్రింటింగ్ కోసం ఈ పదార్థం ఉపయోగపడుతుంది. ఇది మానవ కణజాలానికి ఉండే బలం, కావాల్సిన విధంగా సాగే గుణం కలిగి ఉంటుంది. కొలరాడో, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఈ నూతన త్రీడీ ప్రింట్ పద్ధతిని అభివృద్ధి చేశారు. దీనిని కంటిన్యుయస్ క్యూరింగ్ ఆఫ్టర్ లైట్ ఎక్స్‌పోజర్ ఎయిడెడ్ బై రిడాక్స్ ఇనీషియేషన్ అని అంటారు. దీని ద్వారా ఔషధాలతో కూడిన గుండె బ్యాండేజీలు, కార్టిలేజ్ ప్యాచెస్, సూదులు లేకుండా గాయాన్ని మాయగలిగే వైద్య పరికరాలను తయారుచేయొచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

వయనాడ్‌లో 206 మంది గల్లంతు!

- తుది దశకు సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్
- 357కు చేరిన మృతుల సంఖ్య
- హెల్ప్ ఫర్ వయనాడ్ సెల్ ఏర్పాటు

వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించిన ప్రముఖ నటుడు మోహన్‌లాల్

తిరువనంతపురం, ఆగస్టు 3: వయనాడ్ జిల్లాలో జరిగిన కొండ చరియల విషాదంలో శనివారం నాటికి మృతుల సంఖ్య 357కు చేరుకుంది. ఇంకా 206 మంది ఆచూకీ తెలియటం లేదని కేరళ సీఎం పినరయ్ విజయన్ శనివారం మీడియాకు తెలిపారు. శోధన, సహాయక ఆపరేషన్ తుది దశకు చేరుకుందని చెప్పారు. 'చెలియార్ నదిలో లభ్యమైన మృతదేహాలు, శరీర భాగాల్ని గుర్తించటం కష్టంగా మారింది. జిల్లాలో ఇప్పటివరకు 215 మృతదేహాల్ని వెలికితీశారు. ఇందులో 87 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 30 మంది చిన్నారులుగా గుర్తించారు.' అని విజయన్ తెలిపారు. ఇదిలా ఉండగా, వయనాడ్‌లో తీవ్రంగా నష్టపోయిన బాధితుల కోసం 100 ఇండ్లు నిర్మించి ఇస్తామని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది.

హెల్ప్ ఫర్ వయనాడ్ సెల్ ఏర్పాటు

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందజేయడానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ముందుకు వస్తున్నారని సీఎం విజయన్ అన్నారు. ఓ ఉన్నతాధికారి నేతృత్వంలో 'హెల్ప్ ఫర్ వయనాడ్ సెల్'ను ప్రారంభించినట్టు చెప్పారు. దాతలు helpforwayanad @kerala.gov.in, 9188940013, 9188940014, 9188940015 ఫోన్ నెంబర్ల ద్వారా సంబంధిత అధికారులను సంప్రదించి, విరాళాలు అందజేయవచ్చునని, బాధితుల పునరావాస ప్రక్రియలో పాల్గొనవచ్చునని విజయన్ చెప్పారు.

నటుడు మోహన్‌లాల్ రూ.3 కోట్ల విరాళం

వయనాడ్ బాధితుల పునరావాసం కోసం నటుడు మోహన్‌లాల్ విశ్వ శాంతి ట్రస్ట్ తరపున రూ.3 కోట్లు విరాళం అందజేశారు. తీవ్రంగా ప్రభావితమైన చూరల్‌మాల, ముండక్కై గ్రామాలను టెరిటోరియల్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఆయన శనివారం సందర్శించారు.

రాహుల్‌గాంధీపై బాధితుల ఆగ్రహం!

వయనాడ్‌కు వచ్చిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆయన తన వాహనంలో నుంచి బయటకు దిగకపోవటంతో కొంత మంది ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బయట బురద ఉందని, కారులో నుంచి కిందకు దిగకూడదని రాహుల్ గాంధీ అనుకుంటున్నారా? బురద అంటుతుందని భావిస్తే..ఇక్కడికి ఎందుకు వచ్చాడు' అంటూ ఓ బాధితుడు అరుస్తున్న దృశ్యానికి సంబంధించి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాహుల్‌గాంధీ వయనాడ్ పర్యటన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న మరో వీడియో కూడా సోషల్ మీడియాలో విడుదలైంది.

ప్రాణాలకు తెగించి.. గుహలోని కుటుంబాన్ని రక్షించి..

కల్పేట ఫారెస్ట్ ఆఫీసర్ కే హాషిస్ నేతృత్వంలోని రెస్క్యూ బృందం తమ ప్రాణాలకు తెగించి ఓ గిరిజన కుటుంబాన్ని రక్షించింది. అటవీ ప్రాంతంలో ఉన్న లోయకు ఎదురుగా ఉన్న కొండపై ఓ గిరిజన కుటుంబం చిక్కుకోగా, నాలుగున్నర గంటలపాటు శ్రమించి తాళ్ల సహాయంతో రెస్క్యూ బృందం కొండపైకి చేరుకొని గిరిజన కుటుంబాన్ని కాపాడింది.

శిథిలాల్లో ఉన్న వారిని రోదసి పరిజ్ఞానంతో గుర్తించలేం : ఇస్రో చీఫ్ సోమనాథ్

కొండచరియలు విరిగిపడినపుడు శిథిలాల కింద చిక్కుకున్నవారిని రోదసి పరిజ్ఞానంతో గుర్తించడం సాధ్యం కాదని ఇస్రో చీఫ్ సోమనాథ్ శనివారం చెప్పారు. ఓ కార్యక్రమంలో ఆయన ఓ ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు.

ప్రాణాల కోసం ప్రార్థిస్తే ఏనుగులు వదిలేశాయి!

వయనాడ్ విపత్తులో ప్రాణాలు కాపాడుకునేందుకు ఒక రోజంతా ఓ కుటుంబం చేసిన యుద్ధం వెలుగులోకి వచ్చింది. చూరల్‌మలలోని అంజిశచలయిల్ ప్రాంతానికి చెందిన సుజాత కుటుంబం ఒకే రోజు రెండు భయంకర అనుభవాలను ఎదుర్కొన్నది. కొండ చరియలు విరిగిపడటంతో ఈ కుటుంబం దగ్గరలో ఉన్న ఓ కొండపైకి చేరుకుని ఒక చిన్న గుహ లాంటి ప్రదేశంలో తలదాచుకున్నది. అయితే, వీరి పక్కనే ఒక అడవి ఏనుగుల మంద కూడా ఉన్నది. తమను ఏమీ చేయవద్దని ఏనుగులను ప్రార్థించామని, అవి తమ జోలికి రాలేదని సుజాత చెప్పారు. మరునాడు ఉదయం సహాయ సిబ్బంది వీరిని రక్షించారు. ప్రస్తుతం సుజాతతో పాటు ఆమె మనవరాలు మృదుల సురక్షితంగా ఉండగా, మిగతా కుటుంబసభ్యులు గాయాలతో చికిత్స పొందుతున్నారు.

విసిగిపోయి సెటిల్‌మెంట్ కోరుతున్నారు

కోర్టు వ్యవహారాలపై సీజేఐ చంద్రచూడ్ కీలక వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ప్రజలు కోర్టు వ్యవహారాలతో విసిగిపోయి ఉన్నారని, అందువల్లే వారు సెటిల్‌మెంట్ కోరుకుంటున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. లోక్ అదాలత్‌ల ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం న్యూఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీజేఐ ప్రసంగిస్తూ, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాలుగా 'లోక్ అదాలత్'లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గత వారం రోజులుగా(ఆగస్టు 3 వరకు) స్పెషల్ లోక్ అదాలత్‌ను నిర్వహించింది.

ఎస్ఎస్‌బీ డీజీకి బీఎస్ఎఫ్ అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ: సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌదరికి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దల్జిత్ 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కాగా, బీఎస్ఎఫ్ డీజీ నితిన్ అగర్వాల్, డిప్యూటీ స్పెషల్ డీజీ (వెస్ట్) ఖురానియాలను విధుల నుంచి తొలగిస్తూ కేంద్రం శుక్రవారం అనూహ్య నిర్ణయం తీసుకొన్న విషయం తెలిసిందే.

గోహత్యల వల్లే కేరళలో విలయం

బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

జైపూర్: కేరళలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది మరణించిన క్రమంలో బీజేపీ సీనియర్ నేత ఒకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళలో జరుగుతున్న గోహత్యల కారణంగానే ఇది జరిగిందని రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత జ్ఞానదేవ్ అహుజా ఆరోపించారు. గోహత్యలు ఎక్కడ జరిగినా ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటాయని అన్నారు.

సమస్యలు తప్ప శాంతి లేదిక్కడ!

ఢిల్లీలో సివిల్స్ విద్యార్థిని ఆత్మహత్య

సూసైడ్ నోట్‌లో ఆవేదన

(ఫైల్)

ఢిల్లీలో సివిల్స్ విద్యార్థుల ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ఢిల్లీలో ఐఏఎస్ కోచింగ్ సెంటర్ల తాకిడికి మరో విద్యార్థిని బలైంది. ఎన్నో ఆశలతో ఇక్కడికి వచ్చిన మహారాష్ట్రకు చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో అంజలి అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్టు శనివారం జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. 'అమ్మా నాన్న నన్ను క్షమించండి. నేను నిజంగా విసిగిపోయాను. సమస్యలు, బాధలు..తప్ప మనసుకు శాంతి లేదిక్కడ. బయటపడేందుకు అనేక విధాలుగా ప్రయత్నించా. కానీ నా వల్ల కాలేదు' అంటూ తన మరణానికి కారణాల్ని సూసైడ్ నోట్‌లో ఆమె పేర్కొన్నారు. సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించాలని కలలు కనే విద్యార్థులు ఢిల్లీ కోచింగ్ సెంటర్లలో పడుతున్న అవస్థల్ని ఈ ఘటన మరోసారి బయటపెట్టింది. ఈ ఆత్మహత్య ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాత రాజేందర్ నగర్‌లోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు పోటెత్తడంతో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ముగ్గురు విద్యార్థులు మరణించారు. దీనికంటే కొద్ది రోజుల ముందు ఆత్మహత్య ఘటన చోటుచేసుకుందని సమాచారం. విద్యార్థులను ఇక్కడి ప్రైవేట్ హాస్టల్స్, వసతి గృహాలు దోపిడి చేస్తున్నాయంటూ అంజలీ ఆవేదన చెందేదని తోటి స్నేహితురాలు శ్వేత చెప్పారు. 'అంజలి మూడుమార్లు సివిల్స్ రాసింది. ఫలితం అనుకున్న విధంగా రాలేదు. మరోవైపు ప్రతినెలా పెరుగుతున్న ఖర్చులు, హాస్టల్ అద్దె భరించలేని విధంగా మారాయి. ఇదంతా ఆమెను తీవ్రంగా కుంగదీశాయి' అని శ్వేత వెల్లడించారు.

తాజ్‌మహల్‌లో గంగా జలం పోశారు

వివాదాస్పదమైన యువకుల చర్య

తమ సభ్యుల పనేనన్న హిందూ మహాసభ

ఆగ్రా, ఆగస్టు 3: ఆగ్రాలోని తాజ్ మహల్‌లో శనివారం జరిగిన ఓ ఘటన వివాదాస్పదంగా మారింది. ఇద్దరు యువకులు ప్లాస్టిక్ సీసాలతో నీళ్లు తీసుకువచ్చి, తాజ్‌మహల్‌లోని ప్రధాన సమాధి ఉన్న సెల్లార్ వద్ద పోశారు. దీంతో సీఐఎస్ఎఫ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై వినేశ్ చౌదరి, శ్యామ్ కుమార్ అనే ఇద్దరు యువకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా, తమ సభ్యులు తేజో మహలయ(తాజ్‌మహల్‌ను పలు హిందూ సంస్థలు పిలుస్తున్న పేరు)లో గంగా జలాన్ని సమర్పించినట్టు ఆల్ ఇండియా హిందూ మహాసభ(ఏఐహెచ్ఎం) అధికార ప్రతినిధి సంజయ్ జాట్ ప్రకటించారు.

'మహా'లో కొత్త పొత్తులు?

అసెంబ్లీ ఎన్నికలకు ముందు మారుతున్న సమీకరణాలు

సీఎం ఏక్‌నాథ్ షిండేను కలిసిన శరద్ పవార్

ముంబై : ఈ ఏడాది చివర్లో జరిగే మహారాష్ట్ర ఎన్నికలకు పార్టీలు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నాయి. 288 స్థానాలున్న అసెంబ్లీకి అక్టోబర్‌లో ఎన్నికలు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి అధికార నివాసంలో వీరిరువురి భేటీ జరిగింది. మరాఠా రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలు చర్చల్లో ప్రస్తావించినట్టు పైకి చెప్పినా, వీరి భేటీ పూర్తిగా రాజకీయాలకు సంబంధించినదేనని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు వీరిద్దరూ ఇలా కలుసుకోవడం అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త పొత్తులకు ఏమన్నా తెరతీస్తారా అన్న చర్చలు ప్రారంభమయ్యాయి.

ప్రత్యామ్నాయాలపై పార్టీల దృష్టి

గత కొద్ది సంవత్సరాలుగా మహారాష్ట్రలో అస్థిర ప్రభుత్వం అధికారంలో ఉండటం, తరచూ అధికారం చేతులు మారటంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటింగ్ ద్వారా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ పార్టీపై బీజేపీ చూపుతున్న వైఖరి పట్ల షిండే వర్గం అసంతృప్తితో ఉంది. బీజేపీతో బంధం తెంపుకుని శరద్‌పవార్‌తో కలిస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని షిండే పరిశీలించారని, అందులో భాగంగానే షిండే, పవార్‌ల భేటీ జరిగిందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కోల్‌కతాలో కుంభవృష్టి

ఎయిర్‌పోర్ట్ సహా అనేక ప్రాంతాలు జలమయం

కోల్‌కతా ఎయిర్‌పోర్టు రన్‌వేపై నీళ్లు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా, దాని పరిసర జిల్లాల్లో శుక్రవారం, శనివారం ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. దీంతో విమానాశ్రయం సహా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. అల్ప పీడనం వాయుగుండంగా మారిందని వాతావరణ శాఖ తెలిపింది.

హిమాచల్‌లో ఇప్పటివరకు 77 మంది మృతి

హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు తెరిపి ఇవ్వడం లేదు. ఈ నెల 7 వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆగస్ట్ 1 వరకు వరదల వల్ల రాష్ట్రంలో 77 మంది చనిపోయారని, రూ.655 కోట్ల ఆస్తి నష్టం సంభవించిందని అధికారులు తెలిపారు. కొండ చరియలు విరిగిపడటంతో కులు-మనాలీ హైవే తీవ్రంగా దెబ్బతింది. వర్షాల వల్ల రాష్ట్రంలో 190 రోడ్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. 82 మార్గాల్లో బస్సు సర్వీసులను నిలిపేసినట్లు ఆర్టీసీ ప్రకటించింది. గల్లంతైన 50 మంది కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. సమేజ్ అనే గ్రామంలో కేవలం ఒకటి మినహా మిగిలిన ఇండ్లన్నీ కొట్టుకుపోయాయి. బుధవారం జరిగిన ఈ ఘటన గురించి గ్రామస్థురాలు అనిత దేవి మాట్లాడుతూ.. ''మేము బయటకు చూసేసరికి గ్రామం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. మేమంతా భగవతి కాళీమాత గుడిలో రాత్రంతా తల దాచుకున్నాం'' అని గద్గద స్వరంతో చెప్పారు.

ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సిద్ధం!

టెహ్రాన్: హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్య నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడికి సిద్ధమవుతున్నదనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడులను ఎదుర్కోవడంలో భాగంగా ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా రంగంలోకి దిగినట్టు కనిపిస్తున్నది. ఇరాన్ దాడులను తిప్పికొట్టేందుకు మధ్యప్రాచ్యంలో యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్స్‌ను మోహరిస్తున్నది. కాగా, ఇజ్రాయెల్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని భారత రాయబార కార్యాలయం శుక్రవారం సూచించింది.

అంతరిక్షంలో అద్భుత నిధి

- రూ. కోట్ల విలువైన బంగారం, ప్లాటినం నిక్షేపాలు
- గ్రహ శకలంలో కనుగొన్న నాసా శాస్త్రవేత్తలు
- భూమి మీదకు తెస్తే మానవాళికి పెద్ద సంపద
- అంత సులభం కాదంటున్న శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ: నాసా ఇప్పుడు అంతరిక్షంలో ఒక అద్భుత నిధిని కనుగొంది. వందల కోట్ల రూపాయల విలువైన బంగారం, ప్లాటినం, ఇతర విలువైన లోహాలను అన్వేషించింది. 1852లో అన్నీబలే డి గాస్పరిస్ కనుగొన్న గ్రహశకలం16 సైకిపై 140 మైళ్ల వ్యాస పరిధిలో బంగారం, నికిల్, ప్లాటినం లోహాలు ఉన్నట్టు కనుగొన్నారు. అంగారక, గురు గ్రహాల మధ్య ఉన్న ఈ గ్రహ శకలంలో 100000 డాలర్ల క్వాడ్రిలియన్ విలువైన లోహాలు ఉన్నట్టు నాసా తెలిపింది. ఈ విషయం శాస్త్రవేత్తలు, అంతరిక్ష ఔత్సాహికులను ఆశ్చర్య పరిచింది. అయితే వీటిని వెలికితీయడానికి పలు ఆర్థిక, సాంకేతిక సవాళ్లు ఎదురవుతాయని పేర్కొంటున్నది. 2029 నాటికి ఆస్టరాయిడ్‌లను చేరుకునే లక్ష్యంతో నాసా సైకి మిషన్‌ను 2023 అక్టోబర్ 13న ప్రారంభించింది. తన పరిశోధనలో భాగంగా గ్రహశకలం 16 సైకిపై అపారంగా బంగారం, ప్లాటినం, నికిల్ వంటి ఖరీదైన లోహాలు ఉన్నట్టు నాసా నిర్ధారించింది. అవి తవ్వి భూమి మీదకు తేగలిగితే ప్రపంచ దేశాల స్థితిగతులే మారిపోతాయని పేర్కొంటున్నది.

ఖనిజాల తవ్వకం అంత సులభమా?

ప్రస్తుత అంతరిక్ష మైనింగ్ సాంకేతికత ఇంకా శైశవ దశలోనే ఉంది. తక్కువ గురుత్వాకర్షణ, అధిక రేడియేషన్ ఉండే ఈ లఘుగ్రహంలో కార్యకలాపాలు నిర్వహించగల పరికరాలు అవసరమవుతాయి. అంతేకాకుండా భూమికి, గ్రహశకలం మధ్య కమ్యూనికేషన్‌లో ఏర్పడే ఆలస్యం వల్ల అవి స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సెంట్రల్ ఫ్లోరిడా యూనివర్సిటీ గ్రహ భౌతిక శాస్త్రవేత్త ఫిలిప్ మెట్జ్‌గర్ తెలిపారు. గ్రహాలపై ఖనిజాల తవ్వకం అతి ఖరీదైన వ్యవహారం. వాటిపై తవ్వకాలు జరపడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు సమకూర్చుకోవడానికి చాలా వ్యయం అవుతుంది. అయితే వీటిపై తవ్వకాలకు నిధులు సమకూర్చడానికి ప్రైవేట్ కంపెనీలు ముందుకొస్తున్నా, ముఖ్యమైన వనరులు ఇంకా అవసరమవుతాయి.

ఆ వనరులు భూమి మీదకు తెస్తే అస్థిరతేనా?

అక్కడి నుంచి తెచ్చే ఈ లోహాలు ప్రపంచ మార్కెట్‌లోకి భారీ మొత్తంలో ప్రవేశపెడితే బులియన్, మెటల్ మార్కెట్‌లు ఒక్కసారిగా క్రాష్ అవుతాయి. వాటి విలువ నాటకీయంగా తగ్గిపోతుంది. రూ.60 వేలు ఉన్న బంగారం ధర 600కు పడిపోవచ్చు. దీనంతటికీ డిమాండ్-సప్లయి సూత్రం వర్తిస్తుంది. ఇప్పుడు బంగారం సప్లయి తక్కువగా ఉంది కాబట్టి డిమాండ్ పెరిగి దాని ధర ఎక్కువగా ఉంది. అదే డిమాండ్ లేకపోతే, మార్కెట్లో కావాల్సినంత దొరికితే అది కూడా ఏ స్టీల్ లోహం ధరకో సమానంగా పడిపోతుంది. దీని కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో తీవ్ర కుదుపులు సంభవిస్తాయి. వాటి ప్రభావం పలు పరిశ్రమలు, రంగాలపై తీవ్రంగా పడుతుంది. పౌరుల వద్ద ఉన్న ఆస్తుల విలువ తగ్గిపోతుంది.